క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం



శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో శ్రీవారి శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువ జామునే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాల తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి శాంతి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

విద్యార్థినికి అభినందన



అగనంపూడి: నిరుపేద విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు కేంద్రప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ప్రవేశపరీక్ష ఎన్‌టీఏ శ్రేష్ఠ–నెట్స్‌లో గాజువాకకు చెందిన సీహెచ్.కుసుమ సాయి జాతీయ స్థాయిలో 200వ ర్యాంక్ సాధించింది. శ్రీనగర్‌లోని యాపిల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 8వ తరగతి విద్యార్థిని కుసుమ సీబీఎస్‌ఈ అనుబంధ ప్రైవేట్ విద్యాసంస్థలో తొమ్మిదో తరగతికి ప్రవేశం లభించింది. ఆమెకు కేరళలోని లేబర్ ఇండియా పబ్లిక్ స్కూల్‌లో చదువుకునే అవకాశం దక్కడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సెక్టార్ 11 నుంచి విజయనగరానికి బస్సు



ప్రారంభమైన 111వీ బస్సు

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటి డిపో ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ సెక్టార్–11 నుంచి విజయనగరానికి బస్సు సర్వీసు ప్రారంభించారు. 111 వీ నంబరుతో ఏర్పాటు చేసిన బస్సు సర్వీసు ప్రతీ రోజు ఉదయం 6.10గంటలకు, మధ్యాహ్నం 12.15కు ప్రారంభమవుతుంది. విజయనగరం నుంచి ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 3.15కు తిరిగి బయల్దేరనుంది. ప్రస్తుతం 15 రోజుల పాటు ట్రయల్ రన్‌గా బస్సు నడుతున్నట్టు తెలిసింది. బస్సుకు వచ్చే సర్వీసు బట్టి దానిని కొనసాగించాలని నిర్ణయించినట్లు ఆర్టీసీ అధికారుల సమాచారం.

భారీ వర్షాలకు కూలిన ప్రహరీ



కూలిన గోడను తొలగిస్తున్న జీవీఎంసీ శానిటరీ అధికారులు

పెదగంట్యాడ: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 74వ వార్డు అంబేద్కర్ కాలనీలో ఓ రేకులషెడ్డుకు సంబంధించిన ప్రహరీ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింగరావు ఆ ప్రహరీ శిథిలాలను తొలగించి, కాలువలో నీరు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు.

గోధుమపిండి టెండర్లలో అవకతవకలు

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోధుమ పిండి కోసం దాఖలైన షార్ట్ టెండర్లను సోమవారం రహస్యంగా తీసి, పాత వారికే కట్టబెట్టారని ఏపీ రోలర్ ఫ్లోర్ మిల్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ టెండర్లు దాఖలు చేసిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం అమరావతి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయంలో రహస్యంగా టెండర్లు తెరిచారని, దీని వల్ల తాము ఎంతో నష్టపోయామని అసోసియేషన్ నాయకులు విశాఖలో పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం నాయకులు దృష్టి సారించి, టెండర్ల అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

డేంజర్ జోన్



ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఢీ కొన్న ట్రాలర్, రెడీమిక్స్ కాంక్రీట్ వాహనం (ఫైల్)

- యాక్సిడెంట్ పాయింట్లుగా ఆటోనగర్, భెల్, విశాఖ డెయిరీ క్రాసింగ్ పాయింట్, షీలానగర్
- తరచూ ప్రమాదాలు
- కోల్పోతున్న ప్రాణాలు

అక్కిరెడ్డిపాలెం: ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా రహదారులు రక్తమోడుతూనే ఉన్నాయి. విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పోలీసు అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నా ప్రమాదాల సంఖ్య మాత్రం తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పాతగాజువాక నుంచి షీలానగర్ వరకు యాక్సిడెంట్ జోన్‌గా ప్రకటించి, జాగ్రత్తలు పాటిస్తున్నా పరిస్థితిలో మార్పు లేదు. ఒక వైపు ఇష్టానుసారంగా పరిమితికి మించి ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించడం లేదనే విమర్శలూ వినిపిస్తున్నాయి.



షీలానగర్ సిగ్నల్ పాయింట్

ప్రమాదకర సిగ్నల్ పాయింట్స్

- జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం వద్ద గత ఆదివారం సాయంత్రం షీలానగర్ నుంచి పాత గాజువాక వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీని వెనుక వస్తున్న మరో లారీ బలంగా ఢీ కొట్టింది. దీంతో వెనుక లారీ డ్రైవర్ క్యాబిన్ పూర్తిగా నుజ్జయి, డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. డ్రైవర్ రెండు కాళ్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి



నాతయ్యపాలెం వద్ద బొగ్గు లోడుతో వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొన్న మరో లారీ (ఫైల్)

తీవ్ర గాయాలయ్యాయి.

- ఆటోనగర్, భెల్, విశాఖ డెయిరీ క్రాసింగ్ పాయింట్, షీలానగర్ సిగ్నల్ పాయింట్‌లను యాక్సిడెంట్ల పాయింట్లుగా ఎన్నో మార్లు గుర్తించారు. ఈ సిగ్నల్ పాయింట్స్ వద్ద ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ మధ్య కాలంలో ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద రెడీమిక్స్ కాంక్రీట్ లారీ, భారీ ట్రాలర్ ఢీ కొని కాంక్రీట్ రోడ్డుపై భారీగా పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి.

ఫలితమివ్వని ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్

సున్నా శాతం మరణాలే లక్ష్యంగా పూర్వ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ట్రాఫిక్ స్టచ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. పాత గాజువాక నుంచి షీలానగర్ వరకు యాక్సిడెంట్ జోన్‌గా గుర్తించారు. 15 మంది ప్రత్యేక వలంటీర్లను ఏర్పాటు చేసి, వారికి 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ, ప్రత్యేక వాహనాలను అందించి నిత్యం పర్యవేక్షణ చేస్తుండేటట్లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ప్రమాదాలు మాత్రం జరుగుతూనే ఉండటం వాహనచోదకులను కలవరపెడుతోంది.

ఈ ఏడాదిలో రోడ్డు ప్రమాద మృతులు

- జనవరి నెలలో లంకా మైదానం ఎదురుగా ముగ్గురు ప్రయాణిస్తున్న స్కూటీని గుర్తు తెలియని కారు ఢీకొనడంతో కొట్యాడ సూర్య ప్రభ దుర్మరణం చెందింది.
- మే నెలలో భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద పాదచారుడిని స్కూటీపై వెళ్తున్న నీలం శ్రీనివాస్ అనే వ్యక్తి ఢీ కొట్టడంతో వాహన చోదకుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ దుర్మరణం చెందాడు.
- ఇదే నెలలో గాజువాక వై జంక్షన్‌లో వడ్డాది మహేష్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- పంతులుగారి మేడ వద్ద ఈ నెల 13వ తేదీన స్కూటీపై అగనంపూడికి చెందిన నలుగురు ప్రయాణిస్తుండగా, స్కూటీని వెనుక నుంచి ట్యాంకర్ ఢీ కొట్టడంతో తల్లీ, కుమార్తెలు మృతి చెందారు. తల్లి జాజుల పార్వతి, కుమార్తె సత్యవతి లారీ చక్రాల కింద పడి నలిగిపోయి మాంసం ముద్దలుగా మిగిలారు. ప్రమాదంలో తాత, మనుమడు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఇలా ప్రాణాలు పోగొట్టుకున్న వారే కాకుండా రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ పలువురు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. ఏడు నెలల కాలంలో ఏడుగురు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది.



పంతులు గారి మేడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువతి (ఫైల్)

ఇటీవల ప్రమాదాలు ఎక్కువయ్యాయి

ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ సమీపంలో ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతానికి సమీపంలోనే నేను వ్యాపారం చేసుకుంటున్నాను. ఈ మధ్య జరిగిన ప్రమాదాలు చూస్తుంటే భయంగా ఉంది. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడం, భారీవాహనాలు ఇష్టానుసారం ప్రయాణించడం, వాహనాల్లో పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రయాణం, వాహనాలు అదుపు తప్పడం తదితర కారణాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ట్రాఫిక్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాలను అరికట్టాలి. – వర్మ, అక్కిరెడ్డిపాలెం

తిరిగి ఇంటికి వెళ్తామా అనిపిస్తోంది

ఇటీవల జరుగుతున్న ప్రమాదాలు చూస్తుంటే భయమేస్తోంది. ఉదయం బయల్దేరితే మళ్లీ ఇంటికి చేరుతామా అనే భయం కలుగుతోంది. పాతగాజువాక నుంచి షీలానగర్ సిగ్నల్ పాయింట్ వరకు ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ ఉండాలి. ప్రత్యేక పర్యవేక్షణతోనే ప్రమాదాలను అరికట్టడం సాధ్యమవుతుంది. పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– అప్పారావు, గాజువాక

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్సాహంగా 'శిక్షా సప్తాహ్'

ఆకట్టుకున్న బోధనోపకరణాలు

పెదగంట్యాడ: శిక్షా సప్తాహ్ కార్యక్రమం పాఠశాలల్లో ప్రారంభమైంది. ఇందులో భాగంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలి రోజు అన్ని సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులు బోధన పరికరాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థులకు సులభమైన పద్ధతుల్లో అర్థమయ్యే విధంగా అన్ని రకాల బోధనోపకరణాలను సిద్ధం చేసి పాఠాలను బోధించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. సైన్స్, సోషల్, గణితం, ఇంగ్లిష్, తెలుగు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. వ్యర్థాలతో అతి తక్కువ ధరకే వీటిని తయారు చేసి విద్యార్థులు ప్రశంసలందుకున్నారు. తెలుగు ఉపాధ్యాయులు మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు తయారు చేసిన టీఎల్‌ఎం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సైన్స్ ఉపాధ్యాయులు ప్రయోగశాలలో నిర్వహించే విషయాలను వివరించి ఆకట్టుకున్నారు. రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యాన్ని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించారు. మహానీయుల చిత్ర పటాలను ప్రదర్శించి విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందింపజేశారు. కార్యక్రమంలో మాధవి, శంకర్, రమేష్, లక్ష్మి, కిరణ్, షేక్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



బోధనోపకరణాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఎండీ సాహెబ్‌పేట మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

ఎండీ సాహెబ్ పేట పాఠశాలలో..

జీవీఎంసీ 77వ వార్డు ఎండీ సాహెబ్ పేట మండల పరిషత్ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వనరులతో తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ, పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలి

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సిద్ధం కావాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం కాలపరిమితి గత నెల 9తో ముగిసిందన్నారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ పూర్తిగా విఫలం అయిందన్నారు. గుర్తింపు సంఘం నిర్వాకం వల్ల కార్మికులు అనేక సదుపాయాలు, హక్కులు కోల్పోయారన్నారు. రానున్న ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో 74 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. విభాగం ప్రెసిడెంట్‌గా పోలీస్ నాయుడు, కన్వీనర్‌గా పాల అప్పలరెడ్డి, కార్యదర్శిగా నల్ల రవికుమార్, కోశాధికారిగా డి.వి.రమణ తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం విభాగాధిపతికి నూతన కమిటీని పరిచయం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కారు రమణ, పి.వి. నగేష్, బి.ఎన్. రాజు, ఎస్.ఎ. నాయుడు, పోతారెడ్డి, మొల్లి అప్పారావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగాధిపతికి నూతన కమిటీని పరిచయం చేస్తున్న రాజశేఖర్

'కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని విశాఖ ఉక్కు శ్రామిక సంఘం కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టర్ మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోయినా ఉక్కు ఆగ్రోఫారెస్ట్, టౌన్ అడ్మిన్ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. వారికి ఉక్కు యాజమాన్యమే డైరెక్టుగా జీతాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు పూర్తయినా కార్మికులకు ఫుల్ అండ్ ఫైనల్ చెల్లించడం లేదని, దానికి యాజమాన్యమే బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు, గౌరవాధ్యక్షుడు కరణం సత్యారావు, అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కిల్కారీ'తో తల్లీబిడ్డల ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు
- కిల్కారీ వాయిస్ కాల్స్‌పై అవగాహన

మహారాణిపేట: తల్లీబిడ్డల ఆరోగ్యానికి కిల్కారీ సేవలు దోహదపడుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రేసపువానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఆశా, నోడల్ అధికారులకు సోమవారం కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు వినియోగిస్తున్నామన్నారు. ఈ వాయిస్ కాల్స్ సేవలతో తల్లీ శిశు ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేస్తూ కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ వచ్చేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందని డీఎంహెచ్‌వో వివరించారు.

స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ లంకపల్లి రాజు మాట్లాడుతూ గర్భిణిగా స్థానిక ఏఎన్‌ఎం దగ్గర వివరాలు నమోదు చేసుకున్న సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుందన్నారు. నాలుగు నెలల గర్భిణి నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు. ఈ కాల్ సమయం సుమారు 1.30 నిమిషాలు ఉంటుందని, ప్రతి గర్భిణీ పూర్తిగా వినడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసిన ప్రతి గర్భిణికి 01244451660 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని, ఒక వేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవీఆర్ సిస్టం ఆటోమేటిక్‌గా ఒకే రోజు 3 సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందని రాజు వివరించారు. తిరిగి ఆ సందేశాన్ని వినాలి అనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినవచ్చునని చెప్పారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్స్‌ని 11 మాడ్యూల్స్ ద్వారా రూపకల్పన చేశారన్నారు. 14424 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి ఆశా కార్యకర్తలు ఈ కోర్సులో జాయిన్ కావొచ్చునన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ రాజు, చిత్రంలో డీఎంహెచ్‌వో

చెరువులా రహదారి



ఇస్లాంపేట మసీదు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట మసీదు వద్ద డ్రైనేజీ అవుట్‌లెట్ నిర్మించకపోవడంతో రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. వర్షాలు పడితే చాలు ఈ ప్రాంతం చెరువులా మారడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి పరిస్థితిపై అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు, వర్షపునీరు సాఫీగా వెళ్లేలా అవుట్‌లెట్ నిర్మించాలని కోరుతున్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఆమె పెదగదిలిలోని క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.

కూలిన రక్షణ గోడ



కూలిన రక్షణ గోడ

మల్కాపురం: ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ వాలు ప్రాంతంలో రక్షణ గోడలు కూలుతున్నాయి.దీంతో ఆ ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో వారం రోజుల వ్యవధిలో రెండో సారి రక్షణ గోడ కూలడంతో ఆ ప్రాంత వాసులు రాత్రులు ఆ ప్రాంతంలో ఉండేందుకు భయపడుతున్నారు. 60వ వార్డు పరిధి హనుమాన్‌సం జీవ్‌కాలనీ కొండ ప్రాంతంలో సోమవారం రక్షణ గోడ కూలింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతంలో రక్షణ గోడల దిగువ మట్టి కరుగుతోంది. దీంతో గోడలు కూలుతున్నాయి. సోమవారం ఉదయం కూలిన గోడ దిగువ ఇళ్లపై పడడంతో ఆ ఇంటి శ్లాబ్ పై పడడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో ఆ ఇంటి వారు ఉరుము ఏమైనా పడిందా అని కలవరం చెందారు. ఇదే కాలనీలో గత శనివారం కూడా రక్షణ గోడ కూలింది. ఈ ఘటనలో శిథిలాల కింద రెండు ద్విచక్ర వాహనాలు చిక్కుకున్న సంగతి తెలిసిందే. అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి

- పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు గళమెత్తాలి
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ డిమాండ్
- 1257వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, అధ్యక్షుడు కె.సత్యనారాయణరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1257వ రోజు, సోమవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ఎంపీలందరూ గళం విప్పాలన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, పూర్తి సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి సాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరంలో విశాఖస్టీల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కూర్చున్నారు. నాయకులు కె.రాజబాబు, మసేనురావు, నరేష్‌కుమార్, డొక్కా నరసింగరావు, జి.జయ, శివరామకృష్ణ, తాండ్ర కనకరాజు, చీకటి శ్రీనివాస్, ఎం.ఎం.ఎల్.నాయుడు, వివిధ యూనియన్ల నాయకులు యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ

చీకటి నుంచి విముక్తి

సాక్షి ఎఫెక్ట్..

పెదగంట్యాడ: మదీనాబాగ్ పరిసర ప్రాంతాల ప్రజలకు చీకటి నుంచి విముక్తి కలిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, వైర్లు కాలిపోవడం తదితర సమస్యలపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించి, మరమ్మతులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైంది. వివరాలివి.. జీవీఎంసీ 77వ వార్డు పరిధి మదీనాబాగ్‌లో 3రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మదీనాబాగ్‌లోని పరదేశమ్మ ఆలయం వరకు ఈ సమస్య నెలకొంది. అంతేకాకుండా గాలి వీచినప్పుడల్లా విద్యుత్ వైర్లు ఒకదానితో ఒకటి తగిలి, నిప్పులు రాలడంతో అటుగా రాకపోకలు సాగించేందుకు భయపడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో అక్కడి విద్యుత్ సమస్యలపై 'మూడు రోజులుగా ముసురుకున్న చీకట్లు' శీర్షికన సాక్షి దినపత్రికలో ఈ నెల 22న ప్రచురితమైన కథనానికి ఏపీఈపీడీసీఎల్ ఏఈ రవి తేజస్వి స్పందించారు. సమస్య పరిష్కరించాలని ఆదేశించడంతో లైన్‌మన్ మధు, సిబ్బందితో కలసి సోమవారం కొన్ని ప్రాంతాల్లో పాడైన వైర్లను మార్చారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



వైర్లకు మరమ్మతులు చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో కొండచిలువ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో కొండ చిలువ స్థానికులను హడలెత్తించింది. సకాలంలో స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్ వచ్చి దానిని పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం డీజీఎం మిశ్రా సెక్టార్–6లోని 106 ఏ క్వార్టర్‌లో కుటుంబంతో నివసిస్తున్నారు. సోమవారం ఉదయం మిశ్రా దంపతులు గార్డెన్‌లోకి వెళ్లగా అక్కడ కొండ చిలువ కదులుతూ కనిపించింది. గార్డెన్‌లోని నెట్‌కు చిక్కుకుపోవడంతో అక్కడి నుంచి బయట పడటానికి ప్రయత్నిస్తోంది. కొండ చిలువను చూడటంతో హడలెత్తిన వారు వెంటనే ఆ బ్లాకులోని మిగతా క్వార్టర్లలో ఉన్నవారికి సమాచారం అందించారు. వారు స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. కిరణ్ కుమార్ వచ్చి సుమారు 8 అడుగులు పొడవు ఉన్న కొండ చిలువను అదుపులోకి తీసుకున్నారు. దానికి ఫారెస్ట్ సిబ్బంది సహకారంతో అడవిలో వదిలిపెడతానని ఆయన తెలిపారు. పాములు కనిపిస్తే తనకు 8866368899 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.



కొండ చిలువను పట్టుకున్న కిరణ్‌కుమార్